ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 8 పుష్పం : 10 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 28-10-98, కైకలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భక్తుడికి మారుమనస్సు రావాలంటే భగవంతుని అనుగ్రహం అవసరం. తత్వజ్ఞానాన్ని, నిజమైనవిద్యను గ్రహించే శక్తిని భక్తుడికి భగవంతుడు ఇవ్వాలి కాని లేకపోతే అది గ్రహించటానికి మన తెలివితేటలు సరిపోవు. నీస్వరూపాన్ని తెలుసుకోవటానికి మనస్సుతో చేసే ప్రయత్నం ఒక్కటే సరిపోదు. గురువు అనుగ్రహం, భగవంతుని అనుగ్రహం అవసరము. అందరి హృదయాలలో వస్తువు సమానంగా ఉంది. కాని అది మన సొత్తు అవ్వలేదు. మనహృదయంలో ఉన్న వస్తువును మనం సొంతం చేసుకోవటానికి చేస్తున్న ప్రయత్నాలలో ఈసత్సంగసమావేశాలు ఒకటి, వీటికి మరొక ఉద్దేశం లేదు. చిన్నచిన్న తలంపులు, సంస్కారముల గురించి సృష్టి ఇంత ఇలా వ్యాపించి పోయింది ఏమిటి అని భగవాన్‌ను అడిగారు. మర్రి విత్తనం ఎంత చిన్నది అది భూమిలో పాతితే ఎంత పెద్దచెట్టు అయిపోతుంది. అలాగే నీవాసన కూడా అంతే. నీవాసనే రకరకాలుగా మారిపోతుంది. అందుచేత నీవు దానిని సూక్ష్మరూపంలో ఉండగానే గట్టిగా పట్టుకోవాలి. తలంపు ఉదయించకముందే చూసుకోవాలి. ఉదయించిన తరువాత పెద్దదై పోతుంది. రోగం వచ్చిన తరువాత తగ్గించుకోవటానికి చూసుకోవటం కంటే రోగంరాకుండా చూసుకోవటం మంచిది అప్పుడు బాధ ఉండదు. తలంపు ఉదయించిన తరువాత దానిని స్వాధీనం చేసుకోవటంకంటే ఉదయించకుండా చూసుకోవటం మంచిది. నీకు ఏ తలంపు వచ్చినప్పటికి అది దేహగతమైన తలంపు అయినా, లోకగతమైన తలంపు అయినా ఏది వచ్చినా నీలోపల దోషం ఉంది, నీలోపల పాపం ఉంది అంటారు భగవాన్. కొంతమందికి వారిలోపల దోషం ఉంది అనికూడా వారికి తెలియదు. అలా తెలియకపోవటం కంటే దోషం ఉందని తెలియటం మంచిది ఎందుచేతనంటే తెలిస్తే దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తారు. మనకు జీవభావన ఉంది. జీవభావనను తగ్గించుకొంటూ బ్రహ్మభావనను పెంచుకొంటూ వెళ్ళాలి అదే సాధన.

నీహృదయంలో నిజం ఉంది. ఉన్నంతమాత్రంచేత అది నీకు స్వరూపంగా వ్యక్తంకాదు. ఎప్పడు వ్యక్తమవుతుంది అంటే ధైర్యమైన బుద్ధితోటి, పట్టుదల అయిన బుద్ధితోటి నీమనస్సును లోబరచుకొని నీమనస్సును కనుక హృదయంలో ఉన్న నిజానికి స్వాదీనం చేస్తే అప్పడు అది నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. నీహృదయంలో చైతన్యం ఉంది అని చెపుతున్నారు పైగా

అది నీవే అనిచెపుతున్నారు. అది మనకు తెలియకపోయినా పరవాలేదు. మనకు తెలుసున్న దేహాన్ని, మనస్సును చైతన్యం అని అనుకొంటున్నాము. అక్కడే చిక్కు వస్తోంది. ఈచిక్కునుండి విడుదల చేయటం ఒక్క గురువుకు, ఈశ్వరుడికే సాధ్యం.సబ్జక్టును ముందు అర్ధం చేసుకోండి. అర్ధమయితే ఆచరించాలనే బుద్ది పుడుతుంది. నేను ఎవరి సహాయం అక్కరలేకుండా హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోలేనా అని అడుగుతున్నారు. నీకు తెలుసుకోవాలనే బుద్ది కలిగింది. నీకు తెలుసుకోవాలనే బుద్ది కలగటంకూడా ఈశ్వరుని కరుణే అంటున్నారు భగవాన్.

ఈశ్వరుడు నిన్ను ప్రేమిస్తున్నాడు కాబట్టే, ఈశ్వరుడి దయకు నీవు పాత్రుడవు అవుతున్నావు కాబట్టే ఈశ్వరుడిని తెలుసుకోవాలనే కోరిక నీకు కలుగుతోంది లేకపోతే ఆకోరిక నీకు ఉదయించదు. మనలోని దోషములు, బలహీనతలు తగ్గినప్పుడు మాత్రమే సత్యవస్తువును తెలుసుకోవాలనే సంకల్పము కలుగుతుంది. సత్యవస్తువును తెలుసుకోవాలని అంటున్నావు మంచిదే, కాని ఆవస్తువు అనుకోవాలి నేను వీడికి తెలియబడాలి అని లేకపోతే అది సాధ్యంకాదు. భగవంతుడికి ఒక రూపం లేదు, ఒకనామం లేదు. నీవు ఒకరూపం తోటి, ఒకనామంతోటి తాదాప్యం పొందుతున్నావు. నేనూ రూపరహితుడనే అని నీకు తెలిసినప్పుడు దేవుడు కూడా రూపరహితుడు అన్న సంగతి తెలుస్తుంది. మనం రూపం తోటి తాదాప్యం పొందుతున్నంతకాలం దేవుడిని కూడా ఒకరూపంతో చూడగలంగాని రూపంలేకుండా మనం చూడలేము.

దేహమును ప్రారబ్దమునకు వదిలివెయ్యి. అష్టకష్టాలు అష్టఐశ్వర్యాలు రానియ్యి అవి దేహానికే పరిమితం. అవివస్తూ ఉంటాయి, పోతూఉంటాయి. దేహం ఈభూమి మీదకు ఏపని నిమిత్తం వచ్చిందో అదిచూసుకొని చనిపోతుంది. చనిపోయే దేహంగురించి కాకుండ నీహృదయంలో ఉన్న చావులేని వస్తువును పట్టుకోవటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. అప్పుడు ఈజనన మరణ చక్రంలో నుండి, ఈప్రకృతిలో నుండి విడుదల పొందుతావు. బ్రహ్మము నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. నిరంతరము ఆత్మనే చింతించు ఇతర విషయాలను చింతించవద్దు. ఇతర విషయాలను చింతించవద్దు అని ఎందుకు చెపుతున్నాను అంటే ఇతర విషయాలు నిజం అని నీవు అనుకొన్నా అందులో నిజం లేదు. ఉన్నది ఆత్మ ఒక్కటి మాత్రమే. ఆత్మ పరిపూర్ణం, ఆత్మ పరిశుద్దం. నీవు కావాలని ఆత్మను పరిమితం చేసుకొంటున్నావు అందువలన అజ్ఞానం కలుగుతోంది. నీకు అజ్ఞానం ఉన్నంతకాలం, నీవు దేహబుద్దిలో ఇరుక్కున్నంతకాలం గురువు అవసరమే. ఉన్నవస్తువును దేహానికి, మనస్సుకి, నేను అనే మొదటితలంపునకు కుదించేసుకొంటున్నావు. అందువలన నీకు గురువుకావాలి. భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, ధ్యానం చేయగా చేయగా లాంఛనంగా కాకుండా హృదయపూర్వకంగా నిరంతరము జ్ఞాపకం ఉంచుకొంటూ ప్రేమగా స్మరిస్తూ ఉంటే యోగాలతో సంబందంలేకుండా ఆభక్తుడికి నేను స్వాధీనం అయిపోతాను అని భగవంతుడు చెపుతున్నాడు. మీరు చిల్లర

చింతలు చింతాకంతైనా చింతించవద్దు. నిరంతరము భగవంతుని భావనలో ఉండండి. భగవంతుడు చెప్పిన పనిని చేసుకొంటూ వెళ్లిపో. నీ వెనకాల పొగిడేవారు, విమర్శించేవారు ఉంటారు వాటిని పట్టించుకోవద్దు. నీవు ఎంతమంచి పనిచేసినా విమర్శించేవారు ఉంటారు. అందంతా వదిలివెయ్యి. మనకు మోక్షం ఇచ్చేది ఈశ్వరుడు. ఆయన చెప్పిన పనిని చేసుకొంటూ వెళ్లిపో. నీవు భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా నీభక్తి నిజమయితే నీ ఒక్కడి కోసమే భగవంతుడు గురురూపంలో వస్తాడు. భక్తుడి స్మరణలో ఉన్న ఔన్నత్యం అటువంటిది. నీశరణాగతి నిజమయితే ఆయన అనుగ్రహం వచ్చి నీఅహంభావనను ముంచేస్తుంది. నీకు ఎన్ని కష్టాలు ఉన్నా, ఎన్ని నష్టాలు ఉన్నా ఎన్ని భారాలు ఉన్నా అవి అన్నీ కరిగిపోతాయి.

మనందరికి మోక్షానికి వెళ్లాలని ఉంది. కాని దారి తెలియటం లేదు. భగవంతుడు గురు రూపంలో ఎందుకు వస్తాడు అంటే మార్గం చూపిస్తాడు. ఆమార్గంలో నడిచే శక్తిని ఇస్తాడు. మీపూర్వజన్మ సంస్కారమును బట్టి మీరు ఏమార్గంలో ప్రయాణం చేసిన వాటి లక్ష్యం ఈదేహగతమైన నేనులో నుండి విడుదల పొందటమే. ఒకమంచివాడు ఎప్పడయినా పొరపాటు చేయవచ్చు అంతమాత్రంచేతవాడు చెడ్డవాడు కాదు. ఒక చెడ్డవాడు ఎప్పడైనా మంచిపనిచేయవచ్చు. అంతమాత్రం చేతవాడు మంచివాడు కాదు. మీరు నిజం కాని దానిని నిజం అని నమ్మవచ్చు. మీరు నమ్మారని అది నిజంకాదు. నిజమైన దానిని మీరు నమ్మకపోవచ్చు. మీరు నమ్మనంతమాత్రంచేత నిజం అబద్దం అవ్వదు. గురువు బోధవలన మీ మనస్సు లోపలకు వెలుతుంది. మీరు ఎంతసేపు బయటకు చూడటానికి అలవాటుపడ్డారు. బయటకు చూచే బదులు మీరు లోపలకు చూడండి అంటున్నారు భగవాన్. మనచేత చూడబడేది అంతా నశించేదే. మనం ఈలోకంలోనికి వచ్చాము జ్ఞానం అనే పండును సంపాదించుకొని వెళ్లిపోతే మనకు ఇంక యముడి బాధ ఉండదు. దీనికి రామకృష్ణుడు చెపుతాడు. ఇద్దరు ప్రయాణం చేస్తున్నారు వారికి దారిప్రక్కన మామిడిచెట్టు కనబడింది. కాయలుబాగా ముగ్గి ఉన్నాయి. ఇద్దరిలో ఒకడు మామిడి పండును కోసి తినివాడి దారిని వెళ్లిపోయాడు. రెండోవాడు బోటని చదువుకొన్నాడు. వాడు మామిడిపండును తినటం మానివేసి ఈచెట్టు చాలబాగుంది దీనికి వయస్సు ఎంత ఉంటుంది. దీనికి ఎన్ని ఆకులు ఉన్నాయి, ఎన్ని రొబ్బలు ఉన్నాయి అని లెక్కపెట్టటం మొదలుపెట్టాడు. ఈలోపు చెట్టుయజమాని వచ్చాడు. కాయతిన్నవాడు వెళ్లిపోయాడు. ఈలెక్కలు పెట్టేవాడిని యజమాని పట్టుకొని కొట్టాడు. మనపరిస్థితి కూడా ఇలాగే ఉంది అని రామకృష్ణుడు చెప్పాడు. ఆలోకంలోనికి వచ్చాము. ఆత్మ అనే పండును సంపాదించుకొని వెళ్లపోతే ఇంక యముడి బాధ ఉండదు. అది సంపాదించటం మానివేసి మనం ఏమీ చేస్తున్నాము అంటే ఈప్రపంచం ఎప్పడు నుండి ఉంది, ఈభూమికి వయస్సు ఎంత, సూర్యుడికి వయస్సు ఎంత అని ఈలెక్కలలో ఉన్నాము అసలు వస్తువును తెలుసుకోవటం మానివేసాము. ఈలోపున యముడి చేతిలో పడుతున్నాము,

అక్కడ దెబ్బలు తింటున్నాము.

హృదయంలో ఉన్న సౌందర్యం మాటకు మనస్సుకు అందదు. ఎక్కడయితే మాట అణిగిందో, ఎక్కడయితే మనస్సు అణిగిందో ఆఅణిగిన వాడికి ఆసౌందర్యం తెలుస్తుంది. నీహృదయంలో ఉన్న సౌందర్యం, సుఖం కొన్ని క్షణాలు అనుభవిస్తే సాధన చేసి మరల ఆసుఖాన్ని పొందాలి, జ్ఞానగంగలో మునగాలి అనే తపన నీకు వస్తుంది. జ్ఞానగంగలో ఒక్కసారి మునకవేస్తే అది ఎటువంటిది అంటే ఇంక ఏవ్యాపకం మీదకు నీమనస్సు తిరగదు. పచ్చగడ్డిని చూసి దూడ ఎలాకూడా వస్తుందో అలాగ నీహృదయంలో ఉన్న సుఖాన్ని నీమనస్సు కొద్దిగా చూస్తే నీమనస్సు హృదయం వైపుకు ప్రయాణిస్తుంది. జ్ఞానశక్తి అంతబలీయమైనది. అసలు వస్తువును తెలుసుకొనే వరకు ఏదోరూపంలో నీవు కృషి చేస్తూనే ఉండాలి. నిజమైన భక్తుడికి, నిజమైన సాధకుడికి మాత్రమే భగవంతుని అనుగ్రహం దొరుకుతుంది. కొంతమంది యాంత్రికంగా, లాంఛనంగా చేస్తారు. స్పందన ఉండదు, ప్రేమ ఉండదు వారికి అనుగ్రహం తెలియదు. సత్యాన్వేషకుడు దేనికి రియాక్టు అవ్వడు. లోకంలో వచ్చే కష్టనష్టాలు తట్టుకొంటాడు. వాడు అలా అన్నాడు, వీడు ఇలా అన్నాడు అని రియాక్టు అవుతూ ఉంటే నీప్రయాణం ఆగిపోతుంది. నిరంతరము, నిర్విరామంగా లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎవడైతే ప్రయాణం చేస్తున్నాడో వాడికి మాత్రమే వస్తువు లభ్యమవుతుంది. సత్యసాక్షాత్కారం కావాలంటే మీరు లోకంలో ఏవృత్తిలో ఉన్నా అహంవృత్తిలో మటుకు ఉండకండి అనేవారు భగవాన్.

అన్నామలైస్వామి పూర్వం మీదగ్గరకు వచ్చేవారు ఇప్పుడు రావటంలేదు ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడిగారు. అప్పుడు భగవాన్ అన్నారు మీరు నాదగ్గర కూర్చొని అన్నామలైస్వామిని తలపెడుతున్నారు. అన్నామలైస్వామి ఎక్కడోఉండి నన్ను తలపెడుతున్నారు. ఆయన దేహం ఎక్కడున్నా ఆయన మనస్సు అంతా నామీదే ఉంది అని నాకు తెలుసు. ఇటువంటి కబుర్లు మోసుకొనిరావద్దు అని చెప్పారు. ఈశవం ఎక్కడ ఉంది అనేది ప్రధానంకాదు నీమనస్సు ఎక్కడ ఉంది అనేది ప్రధానం అన్నారు భగవాన్. భగవాన్ ఇలా అన్నారు అని ఈమాటలు ఎవరో అన్నామలై స్వామికి చెప్పారు. జ్ఞాని అంటే ఈశ్వరునితో సమానము. ఆయన నాహృదయంలోఉన్నాడు. ఆయన సర్వసాక్షి కాబట్టి నామనస్సు ఎక్కడ ఉందో తెలియకుండా ఎలా ఉంటాడు అని అన్నామలైస్వామి అన్నారు.

ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. ఇతరులు ఎవరైనా మీకు అపకారంచేస్తే మర్చిపోవాలి. ఎవరైనా ఉపకారం చేస్తే జ్ఞాపకం ఉంచుకోవాలి. దానివలన కృతజ్ఞత వస్తుంది. కృతజ్ఞత ఉంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. ఈశ్వరానుగ్రహంలేకుండా ఈశ్వరస్వరూపమును పొందలేము.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL